సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం | 15 | ఫిబ్రవరి | 2023



హాకీ సంగ్రామానికి ఏర్పాట్లు పూర్తి

హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన బుధవారం నుంచి కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళా హాకీ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

8లో



రత్నగిరి సందర్శన

అన్నవరం: రత్నగిరిపై శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి వారిని మంగళవారం సుమారు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. నవదంపతులు, వారి బంధువులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 6,895 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.70 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

డ్రాపౌట్లు తగ్గించాలి



కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లు తగ్గించాలని, ఇందుకోసం ఎంఈఓలు పిల్లల ఇళ్లకు వెళ్లి, తల్లి దండ్రులతో సంప్రదించి, బడి బయట పిల్లలు లేకుండా పక్కా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. అకడమిక్, నాన్ అకడమిక్ ఎంఈఓలు, ఏపీఎంలతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఒకటి నుంచి 8వ తరగతి వరకూ 17 కేటగిరీల్లో 753 మంది పిల్లలు బడి బయట ఉన్నారని, దీనికి కారణమేమిటని ఆరా తీశారు. వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించే బాధ్యతను ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లోని సంక్షేమ సహాయకులు తమ పరిధిలోని పాఠశాలల్లో తనిఖీలు చేయాలని, జగనన్న గోరుముద్ద మెనూ అమలు, పాఠశాల వసతుల్లో లోపాలుంటే వారి లాగిన్ ద్వారా హెచ్ఎంలు, ఎంఈఓల లాగిన్‌లకు ఆన్‌లైన్ ద్వారా పంపాలని అన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు. ఇంటర్‌లో డ్రాపౌట్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టి గ్రాడ్యుయేషన్ పూర్తి చేయించే వరకూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్, డీఆర్‌డీఏ పీడీ ఎం.శివశంకర్ ప్రసాద్, సీపీఓ వెంకటేశ్వర్లు, గ్రామ/వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు, జిల్లా వృత్తి విద్యాధికారి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు విధుల్లోకి కొత్త డీఈఓ



ఎం.కమలకుమారి

రాయవరం: జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ)గా ఎం.కమలకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జి డీఈఓగా బాధ్యతలు నిర్వహించిన ఎస్‌వీ రవిసాగర్ ఏలూరు జిల్లా ఇన్‌చార్జిగా బదిలీ అయిన విషయం విదితమే. రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కమలకుమారి జిల్లా ఇన్‌చార్జి డీఈఓగా బదిలీపై వస్తున్నారు. రవిసాగర్ మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయినట్టు సమాచారం. కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న డీఈఓ కమలకుమారి 'సాక్షి'తో మాట్లాడుతూ, త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కలెక్టర్ హిమాన్షు శుక్లా పర్యవేక్షణలో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని చెప్పారు. విద్యాపరంగా జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంచేందుకు శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.

ఇంటర్ విద్యార్థులకు నేడు ఎథిక్స్, ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష

రాయవరం: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం నైతిక విలువలు - పర్యావరణం (ఎథిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్) పరీక్ష నిర్వహించనున్నారు. ఈ అంశం వారికి ఒక సబ్జెక్టుగా ఉంది. ఇందులో ఉత్తీర్ణులైతేనే ఇంటర్ సెకండియర్ పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. లేకుంటే ఇంటర్ సెకండియర్ పాసయినప్పటికీ ఉత్తీర్ణత సాధించినట్టు సర్టిఫికెట్ జారీ చేయరు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 13,578 మంది ఈ పరీక్ష రాయనున్నారు.

దారిఖర్చులు.. తడిసిమోపెడు

- జిల్లాలో రోడ్ల నిర్మాణానికి అదనపు భారం
- నల్లరేగడి నేల కావడమే కారణం
- తప్పనిసరిగా ఐదు లేయర్ల నిర్మాణం
- పలుచోట్ల రిటైనింగ్ వాల్స్ కట్టాల్సిన పరిస్థితి
- ఇతర కారణాలూ తోడు
- ఫలితంగా 50 శాతం వరకూ అధికంగా ఖర్చు



అమలాపురం నల్లవంతెన - ఎర్రవంతెన మధ్య చల్లపల్లి పంట కాలువలకు ఇరువైపులా నిర్మించి రిటైనింగ్ వాల్



అమలాపురం బైపాస్ రోడ్డులో 10 అడుగుల పైబడి ఎత్తున నిర్మించిన రిటైనింగ్ వాల్

సాక్షి, అమలాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏ గ్రామంలో చూసినా అడుగడుగునా పంట కాలువలు, మురుగునీటి కాలువలే కనిపిస్తాయి. వేలాది కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ కాలువల వ్యవస్థ ఒకపక్క గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేస్తుండగా.. రహదారుల నిర్మాణానికి పెనుభారంగా మారుతోంది. గోదావరి డెల్టా పరిధిలో రోడ్లు - భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యాన రహదారులను కాలువల వెంబడి నిర్మించాల్సి వస్తోంది. ఇదే సమయంలో కోనసీమ అంతటా నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటంతో ఐదు లేయర్లతో కొత్త రహదారి నిర్మించాల్సి వస్తోంది. ఇటువంటి కారణాలతో జిల్లాలో రహదారుల నిర్మాణానికి అదనపు వ్యయం తప్పనిసరి అవుతోంది.

కారణాలెన్నో..

- జిల్లాలో పంట కాలువలతో పోల్చితే డ్రెయిన్ల వెంబడి గట్లపై రహదారులు 25 శాతం మాత్రమే ఉంటాయి. పంట కాలువల వెంబడి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామ పంచాయతీ రోడ్లు ఎక్కువగా ఉన్నాయి. కాలువ గట్ల పైనే కనీసం 45 శాతం రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.
- కాలువల వెంబడి నిర్మిస్తున్న రహదారులు కుంగిపోకుండా పలుచోట్ల రిటైనింగ్ వాల్స్ నిర్మించాల్సి వస్తోంది. పంట కాలువ లోతు, రహదారి విస్తీర్ణాన్ని బట్టి మీటరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ ఖర్చవుతోంది. ఫలితంగా మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే కోనసీమలో రహదారుల నిర్మాణానికి 30 శాతం అదనంగా ఖర్చవుతోందని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. రిటైనింగ్ వాల్స్‌కు తోడు కల్వర్టులు, వంతెనల వంటి నిర్మాణాల వల్ల కొన్నిచోట్ల అంచనాలకు మించి అదనంగా 50 శాతం వరకూ నిధులు ఖర్చు చేయాల్సి వస్తోంది.
- సాధారణంగా ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) వర్గీకరణకు అనుగుణంగా రోడ్లు నిర్మిస్తారు. కోనసీమలో ఎక్కువగా నల్లరేగడి నేలలు ఉండటంతో కాలిఫోర్నియా బేరింగ్ రేషియో (సీబీఆర్) 3 నుంచి 4 శాతం మాత్రమే ఉంటోంది. దీనివల్ల తొలుత గ్రావెల్, తరువాత గ్రాన్యులార్ సబ్‌వేస్ (జీఎస్‌పీ), ఆపై వెట్ మిక్స్, బ్లాక్ మెటల్ (బీఎం), తరువాత బ్లాక్‌టాప్ (బీటీ - తారు) రోడ్డు నిర్మించాల్సి వస్తోంది. అదే సీబీఆర్ కనుక 10 నుంచి 15 శాతం వరకూ ఉంటే నేరుగా జీఎస్‌పీ, బీఎం, బీటీ వేయవచ్చు. జిల్లాలోని మండపేట, రామచంద్రపురం ప్రాంతాల్లో అక్కడక్కడ తప్ప మిగిలిన ప్రాంతం అంతటా సీబీఆర్ ఐదు శాతం లోపే ఉంటోంది. ఫలితంగా జిల్లాలో రోడ్ల నిర్మాణానికి ఐదు లేయర్లు వేయాల్సి వస్తోంది. ఇందుకు అదనంగా 20 నుంచి 25 శాతం వరకూ ఖర్చవుతోంది.
- అలాగే జిల్లాలో నేలలు గుల్ల స్వభావం కలిగి ఉండటంతో రోడ్డును 6 అంగుళాల నుంచి అడుగు మందంలో నిర్మించాల్సి వస్తోంది.
- రోడ్డు నిర్మాణానికి అవసరమైన ఎర్ర గ్రావెల్, బ్లాక్ మెటల్ జిల్లాలో దాదాపు ఎక్కడా దొరకదు. దీనిని తప్పనిసరిగా దూర ప్రాంతాల నుంచి రవాణా చేయాల్సిందే. ఇది కూడా ఇక్కడ రోడ్ల నిర్మాణంపై అదనపు భారాన్ని మోపుతోంది.

సీబీఆర్ అంటే..

- రోడ్డు నిర్మాణం సందర్భంగా మట్టి సామర్థ్యాన్ని నిర్ధారించే విధానాన్ని కాలిఫోర్నియా బేరింగ్ రేషియో (సీబీఆర్) అంటారు. సాధారణంగా ఇది 15 పాయింట్లు ఉండాలి. ఇంతకన్నా తక్కువ ఉంటే రోడ్డును ఎంత మందంలో నిర్మించాలో నిర్ధారిస్తారు.
- మండే ఎండలు, భారీ వర్షాలు, శీతల వాతావరణాన్ని తట్టుకోవాలంటే దృఢమైన మట్టి ఉండాలి. కొత్తగా రోడ్డు వేసేటప్పుడు మట్టిని నీటిలో వారం రోజులు బాగా నానబెడతారు. మట్టి ఎంత తక్కువ ఉబ్బితే (ప్రెస్ వెల్ ఇండెక్స్) అంత బాగున్నట్టు.

పొదడాల - రాజవరం మధ్య పి.గన్నవరం నుంచి గంటి పెదపూడి వరకూ ఇటీవల ఆర్అండ్‌బీ రహదారి నిర్మించారు. మొత్తం ఎనిమిది కిలోమీటర్ల నిడివి ఉన్న ఈ రహదారిలో 700 మీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మించాల్సి వచ్చింది. ఫలితంగా మీటరుకు రూ.40 వేల చొప్పున రూ.2.80 కోట్ల వరకూ అదనపు భారం పడింది. ఈ రహదారి 25 కిలోమీటర్ల మేర పి.గన్నవరం ప్రధాన పంట కాలువను ఆనుకుని ఉంటుంది. ఈ రోడ్డులో దశలవారీగా కనీసం మూడు కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్స్ నిర్మించాల్సి ఉంది. ఇందుకయ్యే ఖర్చు అక్షరాలా రూ.12 కోట్లు.



పి.గన్నవరం పంట కాలువపై రహదారి కుంగిపోకుండా నిర్మించిన రిటైనింగ్ వాల్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల్లో కాలువల వివరాలు

ప్రధాన పంట కాలువల పొడవు : 520 కిలోమీటర్లు

వీటి పరిధిలో చానల్స్ : 960 కిలోమీటర్లు

డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ : సుమారు 1,000 కిలోమీటర్లు

తూర్పు, మధ్య డెల్టాల్లో మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లు : 337

నిడివి : 1,556 కిలోమీటర్లు

రెవెన్యూ డ్రెయిన్లు : 710

పొడవు : 891.142 కిలోమీటర్లు

ఇక్కడ 70 శాతం ఖర్చు అధికం



కోనసీమలో ప్రధాన రహదారులు కాలువల వెంబడి ఉన్నాయి. కిలోమీటరుకు 10 మీటర్ల చొప్పున లాంగ్ రిటైనింగ్ వాల్స్ నిర్మించడం ఇక్కడ తప్పనిసరి. సాధారణ ప్రాంతాలతో పోలిస్తే జిల్లాలో రహదారి నిర్మాణానికి 70 నుంచి 80 శాతం అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

– అన్యం రాంబాబు, డీఈఈ, పంచాయతీ రాజ్ ప్రాజెక్టు విభాగం, అమలాపురం

శివారుకూ జలాలు



తాతపూడి పంపింగ్ స్కీమ్



పంపింగ్ స్కీములో మోటార్లను పరిశీలిస్తున్న జేఈ

- తాతపూడి పంపింగ్ స్కీముకు రూ.8.8 లక్షల మంజూరు
- 6 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు
- సత్వరమే పనులు ప్రారంభం
- రైతులకు తీరనున్న వెతలు

అలమూరు: శివారు ప్రాంతాల్లో సైతం ప్రతి ఎకరాకూ సాగునీరు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆలమూరు సెక్షన్‌లోని ఆలమూరు, కపిలేశ్వరపురం, కె.గంగవరంతో పాటు రాయవరం, తాళ్లరేవు మండలాల్లోని సుమారు 42 గ్రామాల్లో దాదాపు 6 వేల ఎకరాల్లో నీటిని ఎద్దడిని నివారించేందుకు యుద్ధప్రాతిపదికన నిధులు విడుదల చేసింది.

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఒక్కోసారి నీటి కొరత కారణంగా శివారు ప్రాంతాలకు అదునుకు సాగునీరందించే వీలుండదు. దీంతో కాలువ దిగువ గ్రామాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడేందుకు తాతపూడి వద్ద ఏర్పాటు చేసిన పంపింగ్ స్కీమ్‌ను హెడ్‌వర్క్స్ శాఖ అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకుంటుంది. కోవిడ్‌తో పాటు మూడేళ్లుగా సాగునీటికి కొరత లేకపోవడంతో ఈ పంపింగ్ స్కీమ్ అవసరం లేకుండా పోయింది. ఈ ఏడాది సాగునీటి కొరత ఏర్పడవచ్చన్న హెడ్‌వర్క్స్ అధికారులు సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో తాతపూడి పంపింగ్ స్కీము నిర్వహణ, మరమ్మతులకు ఆలమూరు హెడ్‌వర్క్స్ సెక్షన్ అధికారులు పంపిన ప్రతిపాదనలకు సత్వర ఆమోదం తెలిపి, రూ.8.8 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పంపింగ్ స్కీము మోటార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టనున్నారు. నీటిని పంపింగ్ చేసేందుకు అవసరమైన డీజిల్, గ్రీజు తదితర సామగ్రిని సమకూర్చుకోనున్నారు. వారం రోజుల్లో గౌతమీ గోదావరి నుంచి సాగునీటిని పంపింగ్ చేసి, తూర్పు డెల్టా ప్రధాన కాలువలోకి విడుదల చేసే ప్రక్రియకు హెడ్‌వర్క్స్ శాఖ తక్షణ చర్యలు చేపట్టింది.

రోజుకు 99 క్యూసెక్కుల సామర్థ్యంతో..

తాతపూడి పంపింగ్ స్కీమ్‌లో ఒక్కొక్కటి 125 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ఏడు మోటార్లు ఉన్నాయి. వీటిలో మూడు పాడయ్యాయి. మిగిలిన నాలుగు మోటార్లకు తాత్కాలిక మరమ్మతులు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అన్ని మోటార్లనూ పూర్తి స్థాయిలో పునరుద్ధరించనున్నారు. మొత్తం ఏడు మోటార్లలో ఒక దానిని ప్రత్యేక పరిస్థితుల్లో వినియోగించుకుంటారు. మిగిలిన ఆరు మోటార్లూ విద్యుత్ సరఫరాను బట్టి రోజంతా పని చేస్తాయి. ఒక్కో మోటారు ద్వారా రోజుకు 16.5 క్యూసెక్కుల నీటిని తోడవచ్చు. ప్రస్తుతం పని చేయనున్న ఆరు మోటార్ల ద్వారా 99 క్యూసెక్కుల నీటిని తోడే సామర్థ్యం కలగనుంది. దీని ద్వారా శివారు గ్రామాలకు సాగునీటి సమస్య ఉత్పన్నం కాదని హెడ్‌వర్క్స్ అధికారులు చెబుతున్నారు.

సమర్థవంతంగా పంపింగ్

ప్రభుత్వ ఆదేశాల మేరకు తాతపూడి పంపింగ్ స్కీమ్‌ను సమర్థవంతంగా నిర్వహించి, శివారు ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మోటార్ల మరమ్మతు పనులు ప్రారంభించాం. వారం రోజుల్లో పంపింగ్ చేపట్టే అవకాశం ఉంది.

– ఆర్.విశ్వనాథరాజు, హెడ్‌వర్క్స్ జేఈ, ఆలమూరు సెక్షన్

జిల్లా పవర్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక

- 4 విభాగాలు.. 34 మంది క్రీడాకారులు..
- మార్చి 11, 12 తేదీల్లో అమలాపురంలో రాష్ట్ర స్థాయి పోటీలు



జిల్లా పవర్ లిఫ్టింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పదో సీనియర్ మెన్ అండ్ వుమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలు అమలాపురం వేదికగా వచ్చే నెల 11, 12 తేదీల్లో జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో సోమవారం రాత్రి జరిగింది. జిల్లా నలుమూలల నుంచీ వచ్చిన పవర్ లిఫ్టర్లలో 34 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యులు ఎంపీ సముద్రం, వి.నరేష్, ఎస్.త్రిమూర్తులు, జి.గణేష్‌బాబు ఆధ్వర్యాన ఈ ఎంపిక జరిగింది. సీనియర్స్, మాస్టర్స్, వుమెన్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో ఎంపిక చేసిన 34 మంది లిఫ్టర్ల వివరాలను కృష్ణపద్మరాజు వెల్లడించారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై జిల్లా క్రీడా ప్రతిభను చాటాలని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ వంటిద్దు వెంకన్నాయుడు, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు.

జిల్లా జట్టు వివరాలు

వుమెన్ విభాగం: పి.వందన, ఎం.భావన, ఎం.శ్రేయ, జి.సుభద్ర.

మాస్టర్స్ విభాగం: సీహెచ్ కిరణ్‌కుమార్, వి.శివశంకర్ ప్రసాద్, బి.అప్పన్న, సీహెచ్ శ్రీవెంకటరత్నం, జీఎస్ఎన్ మూర్తి, డీఆర్‌కే నాగేశ్వరరావు, ఎ.శివప్రసాద్.

బెంచ్ ప్రెస్ విభాగం: వి.నరేష్, జీఎస్ శేషగిరిరావు, జి.గణేష్‌బాబు, ఎల్.సత్యనారాయణమూర్తి.

మెన్ విభాగం: ఎం.వీరేంద్ర, వి.లోవకుమార్, పి.క్రాంతి, ఎం.కుమార్, కె.నీరజ్, బి.యశ్వంత్, జి.సచిన్, ఎస్.శివబాబు, వై.ఉదయ్‌కిరణ్, బి.శివసాయి వీరబాబు, బి.సూర్యప్రకాష్, ఎస్.కృష్ణవంశీ, డి.వేణు మణికంఠ, కె.బాబీ, బి.దుర్గాప్రసాద్, డి.వేణుసాగర్, డి.రాజేష్, ఏవీవీ సత్యనారాయణ, జి.సతీష్ కార్తికేయ.

కెప్టెన్: ఎం.వీరేంద్ర. **వైస్ కెప్టెన్:** వి.లోవకుమార్. **కోచ్:** ఎంపీ సముద్రం. **జట్టు మేనేజర్:** వి.నరేష్.

చివరి గింజనూ కొనేశారు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో...

ధాన్యం సేకరణ లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో): 7,94,000

సేకరించిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో): 7,53,277

ధాన్యం విక్రయించిన రైతులు: 1,49,656

కొనుగోలు చేసిన ధాన్యం విలువ: రూ.1,536.04 కోట్లు

రైతుల ఖాతాలకు జమ: రూ.1,445.82 కోట్లు

రైతులకు చెల్లించిన రవాణా చార్జీలు: రూ.6.51 కోట్లు

ఇంకా జమ చేయాల్సిన సొమ్ము: రూ.90.22 కోట్లు



మండపేటలో మిల్లుకు ధాన్యం తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

- ధాన్యం రైతుల కళ్లల్లో ఆనందం
- రికార్డు స్థాయిలో కొనుగోళ్లు
- కొనసాగుతున్న ధాన్యం సేకరణ
- మూడు వారాల్లోనే ఖాతాల్లో సొమ్ము
- కోనసీమలో అదనంగా కొనుగోలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఖరీఫ్ వరి కోతలు మొదలయ్యేసరికి కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుపై రైతుల్లో అనేక అనుమానాలు.. కొనుగోలు చేసినా సమయానికి ఖాతాకు సొమ్ము జమవుతుందా లేదా అనే ఆందోళన.. గత ప్రభుత్వాల్లో మాదిరిగా అయినకాడికి కమీషన్ ఏజెంట్లకు అమ్మేసుకోవాల్సి వస్తుందనే దిగులు.. ఈ అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకే ఒక్క మాట చెప్పారు. పండించిన ప్రతి ధాన్యం గింజనూ కనీస మద్దతు ధరకు కొని తీరుతామని అన్నారు. ఆ మాట ఆచరణ సాధ్యం చేసి చూపారు. ధాన్యం సేకరణ మొదలైనప్పటి నుంచి వారంలో రెండుసార్లు ఆయనే నేరుగా ఉమ్మడి తూర్పు గోదావరిలోని ముగ్గురు జిల్లా కలెక్టర్లతో సమీక్షలు నిర్వహించారు. సేకరణ ఒక కొలిక్కి వచ్చే వరకూ ఒక రకంగా వెంట పడ్డారనే చెప్పాలి. అందువల్లే ఖరీఫ్ ధాన్యం సేకరణ విజయవంతంగా, సంపూర్ణంగా ముగిసింది. ఈ వాస్తవం గణాంకాలతో సహా నిరూపితమవుతున్నా పచ్చ పత్రికలు మాత్రం బురద జల్లుతూనే ఉన్నాయి.

కళ్లాలకే వచ్చి కొనుగోలు

ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసింది. సీజన్ ముగుస్తున్నా ఇంకా అక్కడక్కడ మిగిలి ఉన్నా కొనుగోళ్లు కొనసాగిస్తూనే ఉంది. లక్ష్యానికి అనుగుణంగా 90 నుంచి 95 శాతం సేకరణ పూర్తవ్వడంతో రైతులు సంతోషంగా కనిపిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా గత ఏడాది నవంబర్ మొదటి వారంలో ధాన్యం సేకరణ మొదలైంది. సీజన్ ముగింపు దశకు చేరుకున్నా రైతుల విజ్ఞప్తితో ఈ నెలాఖరు వరకూ ప్రభుత్వం కొనసాగిస్తోంది. మునుపెన్నడూ ఏ ప్రభుత్వమూ చేయని రీతిలో సేకరణ విషయంలో సరికొత్త రికార్డు సృష్టించింది. మద్దతు ధరకు కొనుగోలు చేయడమే కాకుండా రైతుల ఖాతాలకు సకాలంలో సొమ్ములు జమ చేయడంలో కూడా గత రికార్డులను తిరగరాసిందని చెప్పవచ్చు. పునర్విభజన అనంతరం ఏర్పడిన మూడు జిల్లాల్లోనూ అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో పోటీ పడ్డారు. కళ్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తామని సీజన్ ప్రారంభంలోనే ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. చెల్లింపు విషయంలోనూ అదే చెప్పారు. అందుకు తగ్గట్టుగానే కొనుగోలు చేసిన మూడో రోజు నుంచే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయడం మొదలైంది. ప్రభుత్వం నిర్దేశించిన 21 రోజుల గడువులోగా జమ చేయడంతో రైతుల్లో ఆనందం తొణికిసలాడుతోంది.

విజయవంతం ఇలా..

- ఈసారి ధాన్యం కొనుగోలులో మిల్లర్ల ప్రమేయాన్ని ప్రభుత్వం పూర్తిగా నియంత్రించింది.
- గతానికి భిన్నంగా ఆర్‌బీకేల ద్వారా నేరుగా కళ్లాల్లోనే ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించారు.
- కళ్లాల నుంచి మిల్లు వరకూ రవాణా చార్జీలు కూడా పారదర్శకంగా రైతుల ఖాతాలకు జమ చేశారు.
- చంద్రబాబు హయాంలో రైతుల నుంచి ధాన్యం సేకరించిన మూడు నాలుగు నెలలకు గాని రైతుల ఖాతాకు డబ్బులు జమయ్యేవి కావు. కొందరు రైతులకైతే ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు చేస్తే రబీ సీజన్ వరకూ కూడా నిరీక్షించాల్సి వచ్చేది. ఈలోపు వ్యవసాయ పెట్టుబడుల కోసం కమీషన్ ఏజెంట్లు, ఎరువుల దుకాణాల యజమానుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయడం రైతులకు తప్పేది కాదు.
- ఈ సీజన్‌లో ప్రభుత్వం నూతన విధానాలను అనుసరించడం ద్వారా రైతుల ఇబ్బందుల నుంచి గట్టెక్కించింది.
- 90 నుంచి 95 శాతం మందికి మూడు వారాలు దాటకుండానే సొమ్ము జమ చేయడంలో సఫలీకృతమైంది.

కొనుగోలుకు మళ్లీ అనుమతి

ఇంకా రైతుల వద్ద ఇంకా ధాన్యం ఉందని కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు వ్యవసాయ మిషన్ డైరెక్టర్ జిన్నూరు బాబీ తదితర రైతు ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ జిల్లాలో అదనపు కొనుగోలుకు సైతం సీఎం అనుమతించారు. గత నెలలో అదనంగా 5 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ఆదేశాలు జారీ అయ్యాయి. నాటి నుంచి ఇప్పటి వరకూ అదనంగా 6,763 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం రైతులకు ఊరటనిచ్చింది. ఈ అదనపు లక్ష్యం మేరకు కొనుగోలు చేసిన రెండు వారాలకే రూ.59.76 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఇప్పటికీ సేకరణ కొనసాగుతోంది. కాకినాడ జిల్లా తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల రైతులు సన్న రకాలను పొలాల్లోనే కుప్పలుగా వేసుకున్నారు. ప్రస్తుతం అపరాల మాసూళ్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నెలాఖరు వరకూ ధాన్యం సేకరించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

ఇలా కొన్నారు.. అలా డబ్బులు పడ్డాయి



నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఆర్‌బీకే ద్వారా సుమారు 90 క్వింటాళ్ల ధాన్యం మిల్లుకు తరలించాం. ఈసారి తొమ్మిది రోజుల్లోనే ధాన్యం సొమ్ము బ్యాంకులో పడటం ఆనందంగా ఉంది. గతంలో రెండు మూడు నెలలకు పైగా పట్టేది. దళారుల జోక్యం లేకుండా సొసైటీ సిబ్బందే నేరుగా ధాన్యం కొనుగోలు చేశారు.

– చిరుకూరి సుబ్రహ్మణ్యం, కేశవరం, మండపేట మండలం

క్లుప్తంగా

రాజమహేంద్రవరం - విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: కరోనా కారణంగా గతంలో నిలిచిపోయిన రాజమహేంద్రవరం - విశాఖపట్నం ప్యాసింజరు రైలు స్థానంలో రెండేళ్ల తరువాత ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలెక్కింది. దీనిని రాజమహేంద్రవరంలో రైల్వే స్టేషన్ మేనేజర్ గంగాప్రసాద్, క్రూ కంట్రోలర్ బీవీబీకే రెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. రాజమహేంద్రవరం – విశాఖపట్నం – రాజమహేంద్రవరం మధ్య ప్రతి రోజూ ఈ రైలు నడుస్తుంది. 07566 నంబర్ రైలు రాజమహేంద్రవరంలో ప్రతి రోజూ ఉదయం 9.25 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 2.50 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. తిరిగి 07567 నంబరుతో విశాఖపట్నంలో సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరి రాత్రి 11.35 గంటలకు రాజమహేంద్రవరం చేరుతుంది. మార్గం మధ్యలో ఈ రైలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కడియం, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, మేడపాడు, సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, అన్నవరం, రావికంపాడు, హంసవరం, తుని రైల్వేస్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది.

డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాలలో ఉద్యోగాలు

కాకినాడ క్రైం: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల (1962 టోల్‌ఫ్రీ నంబర్) ఆధ్వర్యంలోని ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ పరిధిలో వివిధ పోస్టుల భర్తీకి మంగళవారం ప్రకటన వెలువడింది. ఉమ్మడి జిల్లాలో వెటర్నరీ డాక్టర్లు 10, పేరావెటిట్స్–5, డ్రైవర్లు–15 పోస్టులు భర్తీ చేయనున్నారు. వెటర్నరీ వైద్య పోస్టుకు బ్యాచలరీ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ అర్హత ఉండాలి. ఫ్రెషర్లతో పాటు విశ్రాంత పశువైద్యులూ అర్హులే. డ్రైవర్ ఉద్యోగానికి టెన్త్ పూర్తి చేసి, ట్రాన్స్‌పోర్టు బ్యాడ్జ్, లైసెన్స్ కలిగి ఉండాలి. ఇంటర్వ్యూలు కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న వెటర్నరీ హాస్పటల్‌లో నిర్వహించనున్నట్టు డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల జిల్లా మేనేజర్ మోహన్ గాంధీ తెలిపారు. వివరాలకు 91605 66668 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి

పెద్దాపురం: బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పెద్దాపురం ఎస్సై వెలుగుల సురేష్ కథనం ప్రకారం.. పులిమేరుకు చెందిన జెట్టి శ్రీనివాస్ (38) స్థానిక ఈశ్వరమ్మ గుడి సమీపాన ఉన్న కిల్లీ కొట్టు వద్ద మంగళవారం సాయంత్రం సోడా తాగి ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. అప్పటికే నీరసంగా ఉన్న అతడు మార్గం మధ్యలో ప్రమాదవశాత్తూ పక్కనే ఉన్న బావిలోకి జారి పడ్డాడు. చాలాసేపటికి కానీ ఎవరూ గమనించకపోవడంతో బావిలో కూరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఘన చరితకు చెరగని గురుతులు

- యానాంలో ఫ్రెంచి పాలనకు ఆనవాళ్లెన్నో..
- వారసత్వ గుర్తింపునకు నోచని కట్టడాలు



ఫ్రెంచి వారు నిర్మించిన రోమన్ కేథలిక్ చర్చి (అంతరచిత్రం) చర్చి లోపలి భాగం

యానాం: పర్యాటకుల స్వర్గధామంగా విలసిల్లుతున్న ప్రాంతం యానాం. ఇక్కడ ఆకట్టుకునే, ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి అందాలెన్నో ఉన్నాయి. గోదావరి సాగర సంగమ ప్రాంతం, పారిస్‌లోని ఈఫిల్ టవర్‌ను పోలి ఉండే ఓబ్లిస్క్ టవర్, రాజీవ్ బీచ్.. ఇలా అనేక పర్యాటక ఆకర్షణలు ఇక్కడ కొలువుతీరాయి. వీటితో పాటు ఘనమైన ఈ ప్రాంత చరిత్రను గుర్తు చేసే.. వలస పాలనకు సాక్ష్యంగా నిలిచే ఆనవాళ్లెన్నో యానాంలో ఉన్నాయి. ఫ్రెంచి నిర్మాణ శైలిలో ఉండే ఈ కట్టడాలు సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటాయి. యానాం.. భౌగోళికంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్యన ఉన్నప్పటికీ.. పాలనా పరంగా కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి పరిధిలో ఉంది.

ఫ్రెంచి పాలనకు సాక్షిగా..

దాదాపు మూడు శతాబ్దాల కిందట ఫ్రెంచి వారు వ్యాపార అవసరాల నిమిత్తం మన దేశానికి వచ్చారు. సముద్ర తీరం గుండా మన గడ్డపై కాలు మోపి.. వ్యాపారం సాగించడంతో పాటు పరిపాలనను సైతం హస్తగతం చేసుకున్నారు. 1723 నుంచి రెండు శతాబ్దాల పాటు ఇక్కడ వారి ఏలుబడి సాగింది. పాలన సజావుగా సాగించడానికి వీలుగా వారికి అవసరమైన అనేక మౌలిక సౌకర్యాలు సమకూర్చుకున్నారు. ఇందులో భాగంగా ఫ్రెంచ్ ఆర్కిటెక్ట్ నమూనాలో పలు కట్టడాలను నిర్మించారు. స్వాతంత్ర్యం అనంతరం ఫ్రెంచి వారు 1954లో పుదుచ్చేరిని భారత దేశంలో విలీనం చేశారు. అనంతర కాలంలో వారు నిర్మించిన కొన్ని భవనాలు శిథిలమైపోయాయి. సుమారు 10 వరకూ నిర్మాణాలు మాత్రం ఇప్పటికీ ఫ్రెంచి వారసత్వ చిహ్నాలుగా సజీవంగానే మిగిలి ఉన్నాయి.

వారసత్వ గుర్తింపు ఇవ్వాలి

పుదుచ్చేరిలో ఫ్రెంచి వారు నిర్మించిన భవనాలు వందకు పైగా ఉన్నాయి. వీటిలో 36 ప్రభుత్వ స్వాధీనంలో, 60 అరబిందో ఆశ్రమ ఆధీనంలో ఉండగా మరో 9 ఇప్పటికీ ఫ్రెంచి ప్రభుత్వ నిర్వహణలోనే ఉన్నాయి. వీటన్నింటికీ స్టేట్ లెవెల్ హెరిటేజ్ కన్జర్వేషన్ భవనాలుగా పుదుచ్చేరి ప్రభుత్వం ఇటీవల నోటిఫై చేసింది. ఈ భవనాలకు ప్రపంచ వారసత్వ గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది కూడా. ఇదేవిధంగా యానాంలోని ఫ్రెంచి కట్టడాలకు కూడా వారసత్వ గుర్తింపు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోమన్ కేథలిక్ చర్చి

1789లో వచ్చిన తుపానుకు కోరంగి వద్ద ఉన్న ఓ చర్చి కూలిపోయింది. ఆ ప్రమాదంలో ఆ చర్చి ఫాదర్ మృతి చెందారు. ఆ తరువాత ఆ చర్చికి సంబంధించిన పవిత్ర పాత్ర (చాల్ ఐస్), సెయింట్ ఆన్ విగ్రహం తుపానుకు కొట్టుకువచ్చాయని, వాటితో యానాంలో సెయింట్ ఆన్స్ రోమన్ కేథలిక్ చర్చి నిర్మాణం జరిగిందని చరిత్ర చెబుతుంది. అనంతరం ఈ చర్చి పునర్నిర్మాణం 1839, 1845, 1857 సంవత్సరాల్లో జరిగిందని రికార్డులు చెబుతున్నాయి. సూడనీస్ పద్ధతిలో నిర్మించిన ఈ చర్చి నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. దీనిని పర్యాటక నిధులు రూ.80 లక్షలతో ఇటీవల ఆధునీకరించారు.

ఫ్రెంచి సమాధులు



ఫ్రెంచి వారి సమాధులు

ఆ కాలంలో ఉద్యోగ, వ్యాపార రీత్యా యానాం వచ్చిన ఫ్రెంచి వారు ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆ కాలంలో అనారోగ్యం, వృద్ధాప్యం తదితర కారణాలతో మృతి చెందిన ఫ్రెంచి వారిని మెట్టకూరు మార్గంలో ఉన్న ఫ్రెంచి సెమెటరీలో ఖననం చేసేవారు. ఫ్రెంచి టీచర్లు, మిషనరీల నుంచి వచ్చి సిస్టర్లు, వ్యాపారులు, పెద్ద దొరలు, నౌకాధికారులు, జడ్జీలు, సైనికాధికారుల సమాధులు ఇక్కడ ఉన్నాయి. వారి సమాధులపై ఉన్న ఫలకాలను అధ్యయనం చేసిన ఔత్సాహికులు.. 1820 నుంచి ఉన్న సమాధులు, మృతుల వివరాలతో ఓ పుస్తకం కూడా రాశారు.

మరెన్నో..

- 19వ శతాబ్దం ప్రారంభంలో యానాం ప్రాంతాన్ని తుపానులు, వరదలు, ఉప్పెనల వంటి ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తాయి. వీటి నుంచి రక్షణ కోసం 1834లో యానాం పట్టణం చుట్టూ 300 మీటర్ల మేర గోడ నిర్మించారు.
- ప్రస్తుతం పరిపాలన సాగిస్తున్న అడ్మినిస్ట్రేటివ్ బంగ్లా ఫ్రెంచి కాలం నాటిదే.
- 1848లో నిర్మించిన మసీదు.
- ఫ్రెంచి భాషా సంస్కృతులను పెంపొందించేందుకు 1894లో ×సర్కిల్ ది యానాం× భవనం నిర్మించారు.
- ప్రస్తుతం ఉన్న సబ్ కోర్టు భవనాన్ని సైతం 1725లో నిర్మించారు.
- పరిపాలనా కార్యాలయం వద్ద ఉన్న జెండా స్తంభం కూడా ఫ్రెంచి వారి కాలంలో నిర్మించినది కావడం విశేషం.



ఫ్రెంచి వారు నిర్మించిన కోర్టు భవనం

ఫ్రెంచి భవనాలను పరిరక్షించాలి



ఫ్రెంచి కాలం నాటి భవనాలకు పుదుచ్చేరి ప్రభుత్వం వారసత్వ కట్టడాలుగా గుర్తింపునిస్తోంది. యానాంలో ఉన్న ఫ్రెంచి భవనాలను సైతం వారసత్వ జాబితాలో చేర్చి, పరిరక్షించాల్సిన బాధ్యత పుదుచ్చేరి ప్రభుత్వంపై ఉంది.

– బొల్లోజు బాబా, చరిత్రకారుడు, అధ్యాపకుడు, యానాం

వారసత్వ గుర్తింపునకు కృషి



పుదుచ్చేరి ప్రాంతంలోని పలు ఫ్రెంచి కట్టడాలను పరిరక్షించే ప్రధాన ఉద్దేశంతో ఇటీవల వారసత్వ గుర్తింపు (హెరిటేజ్ భవనాలు) ఇచ్చారు. అదే విధంగా యానాంలోని ఫ్రెంచి కట్టడాలకు కూడా వారసత్వ గుర్తింపు ఇచ్చి పరిరక్షించాలి. ఈ విషయాన్ని పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి దృష్టికి తీసుకువెళ్తాను.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

వాడపల్లి వెంకన్న ఆలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్లు



ఐఎస్ఓ ప్రతినిధులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: నాణ్యతా ప్రమాణాలు, ఫుడ్ సేఫ్టీకి సంబంధించి వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్లు లభించాయి. ఈ మేరకు ఐఎస్ఓ ప్రతినిధులు మంగళవారం ఆలయాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానం, ప్రసాద వినియోగం, భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వీటిని నిర్వహిస్తున్నందున దేవస్థానానికి క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సర్టిఫికెట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఐఎస్ఓ ప్రతినిధులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారికి చైర్మన్, ఈఓలు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను బహూకరించారు.

గాయపడిన విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కును అందిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లిలోని విజేడం యూపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాల సందర్భంగా గత నెల 11వ తేదీన భోగి మంటలు చెలరేగి ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా గాయపడిన విద్యార్థులకు ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఆ విద్యార్థులు కొంతవరకూ కోలుకున్నారు. నెల రోజుల తరువాత పాఠశాల యాజమాన్యం స్పందించింది. గాయపడిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని మంగళవారం ప్రకటించింది. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకుల సమక్షంలో ముందస్తు సాయంగా ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులను ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ డి.రాంబాబు అందజేశారు. కార్యక్రమంలో రేవు తిరుపతి రావు, పాలమూరి మోహన్‌బాబు, గుత్తాల సుభాష్ చంద్రబోస్, చప్పిడి దుర్గారావు, పండు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న 'నవోదయ' గడువు

రాయవరం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల గడువు బుధవారంతో ముగియనుంది. తొలుత జనవరి 31వ తేదీ తుది గడువుగా నిర్ణయించారు. దీనిని ఫిబ్రవరి 8, అనంతరం 15వ తేదీ వరకూ పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం 10 గంటల సమయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3,270 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని సమాచారం. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 4,882 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈసారి 7,761 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత ఏడాది ఏకంగా 10,741 మంది దరఖాస్తు చేయగా, ఈ ఏడాది 11,815 మందితో దరఖాస్తు చేయించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. గడువు బుధవారంతో ముగియనుండగా మంగళవారం ఉదయం 10 గంటల సమయానికి 66 శాతం మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యం

పిఠాపురం: ఆలయాల వద్ద భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టూరిస్టు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. పాదగయ క్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన టూరిస్టు పోలీసు స్టేషన్‌ను సీఎం వైఎస్ జగన్ మంగళవారం వర్చువల్ పద్ధతిలో ప్రారంభించగా.. ఎస్పీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులకు తగిన సమాచారం ఇవ్వడంతో పాటు పూర్తి రక్షణ కల్పించేందుకే టూరిస్టు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా తగిన సహకారం అందిస్తారని తెలిపారు.

గ్రహణం మొర్రికి రేపు ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

ముమ్మిడివరం: గ్రహణ మొర్రికి గురువారం ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ ఎస్‌వీ రవిసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బసవతారకం ఇండో అమెరికా క్యాన్సర్ ఆసుపత్రి, సమగ్ర శిక్ష వైద్యుడు ముకుందరెడ్డి ఆధ్వర్యాన ఈ శిబిరం జరుగుతుందన్నారు. ముమ్మిడివరం మానవ వనరుల కేంద్రంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రహణ మొర్రితో బాధ పడుతున్న ఆరు నెలల నుంచి 50 సంవత్సరాల వయస్సు వారు ఆపరేషన్ చేయించుకోవచ్చునని ఐఈ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. వివరాలకు 99 6365 4283 నంబరులో సంప్రదించాలని రవిసాగర్ సూచించారు.

యువకుడి అనుమానాస్పద మృతి



కల్యాణ్ మృతదేహం

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రు శివారు రాచబంద వద్ద పంట పొలాల్లో ఓ యువకుడు మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడిని కె.గంగవరం మండలం తాళ్లపూడి శివారు అంబేడ్కర్ నగర్‌కు చెందిన కాటే కల్యాణ్(25)గా గుర్తించారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న కల్యాణ్ ఈ నెల ఏడో తేదీన గ్రామానికి వచ్చాడు. తెలిసిన వాళ్ల పెళ్లికి వెళ్తున్నానని చెప్పి, సోమవారం రాత్రి ఇంటి బయలుదేరిన అతడు మంగళవారం ఉదయం దుగ్గుదుర్రులో శవమై కనిపించాడు. పొలాల్లో పంపుసెట్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై అతడు మృతి చెందినట్టు స్థానికులు చెబుతున్నారు. సంఘటన స్థలాన్ని కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్, గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్‌లు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో సందర్శించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వరి పొలాల్లో ఎలుకల నిర్మూలనకు పలువురు రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు తగిలి కల్యాణ్ మృతి చెంది ఉండవచ్చని కూడా పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే అసలు కల్యాణ్ పంటపొలాల్లోకి వెళ్లాల్సిన అవసరం ఏముంటుందని, ఎవరో అతడిని హత మార్చి, మృతదేహాన్ని పొలాల్లో పడవేసి ఉండవచ్చనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పోస్టుమార్టం, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం నివేదికలు వచ్చేంత వరకూ ఎటువంటి నిర్ధారణకూ రాలేమని, ప్రస్తుతానికి అనుమానాస్పద కేసుగా నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విజ్ఞాన సుమాలు వికసించే వేళ..

- 16, 17 తేదీల్లో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన
- అంబాజీపేట జెడ్పీ హైస్కూలులో నిర్వహణ
- 110 ప్రాజెక్టులకు చోటు

అంబాజీపేట: చదువు, ఆటలే కాదు.. విభిన్న వైజ్ఞానికాంశాల రూపకల్పనలోనూ తామేమీ తక్కువ కాదని నిరూపించుకునే దిశగా విద్యార్థులు అడుగులు వేస్తున్నారు. గతంలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు జిల్లా స్థాయిలోనే నిర్వహించేవారు. దీనికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్, మండల స్థాయిల్లో సైతం ఈ ప్రదర్శనలు నిర్వహించింది. వీటిలో ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నారు. పర్యావరణం, పరిశుభ్రత, మానవుని జీవన విధానం, ప్రకృతి విపత్తులకు అడ్డుకట్ట, ప్రమాదాల నివారణ, సమయం ఆదా, జీవ వనరుల సంరక్షణ – ఉపయోగం తదితర అంశాలపై తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను అంబాజీపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. దీనిని విజయవంతం చేసేందుకు జిల్లా విద్యాశాఖాధికారి నేతృత్వంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వీర వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన 16 కమిటీలు ఏర్పాటు చేశారు.

కొత్త జిల్లాలో తొలిసారిగా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడిన అనంతరం తొలిసారిగా జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఇక్కడ నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన 110 ప్రాజెక్టులను ఆయా విద్యార్థులు ఇక్కడ ప్రదర్శిస్తారు. జిల్లా స్థాయిలో మూడు ప్రదర్శనలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. జిల్లా స్థాయికి ఎంపికైన అన్ని ప్రాజెక్టులనూ ఇక్కడ ప్రదర్శించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఇప్పటికే ఆయా ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి, జిల్లా పరిషత్ సీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి తదితరులు పాల్గొంటారు.


సృజనాత్మకతను వెలికి తీసేందుకే..



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఏటా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది పాఠశాల స్థాయి నుంచి నిర్వహించడం సరికొత్త చర్య. విద్యార్థుల్లోని మేధోసంపత్తిని వెలికి తీసేందుకు సైన్స్ కాంగ్రెస్ దోహదపడుతుంది.

– ఎస్‌వీ రవిసాగర్, డీఈవో, అమలాపురం

ఏర్పాట్లు పూర్తి



జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలకు ఇది వేదికగా నిలుస్తుంది. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రతి ప్రాజెక్టునూ ఇక్కడ ప్రదర్శించేందుకు ప్రధానోపాధ్యాయులు సహకరించాలి.

– గిరజాల వీర వెంకట సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

హాకీ సంగ్రామానికి ఏర్పాట్లు పూర్తి

- 25 రాష్ట్రాల నుంచి రానున్న క్రీడాకారిణులు
- నేటి నుంచి 26 వరకూ పోటీలు



హాకీ పోటీలకు సిద్ధమైన యాస్ట్రో టర్ఫ్ మైదానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన బుధవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకూ కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళా హాకీ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోటీల నిర్వహణకు యాస్ట్రో హాకీ టర్ఫ్ మైదానాన్ని నిర్వాహకులు సిద్ధం చేశారు. 80 ఏళ్ల హాకీ చరిత్రలో వుమెన్ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలు ఆంధ్రప్రదేశ్‌లో జరగడం ఇదే తొలిసారి. దీంతో నిర్వాహకులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేశారు. ఈ పోటీలకు 25 రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారిణులు, కోచ్‌లు, మేనేజర్లు హాజరు కానున్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు హాకీ మైదానంలో ప్రత్యేక ఫ్లడ్ లైట్ సౌకర్యం కల్పించారు. వైద్య, ఆరోగ్య శాఖ, కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యాన వైద్య, పారిశుధ్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. పోటీల ఏర్పాట్లను హాకీ ఆంధ్రప్రదేశ్ సలహాదారు నిరంజన్‌రెడ్డి, అధ్యక్షుడు చాణుక్యరాజ్, కార్యదర్శి హర్షవర్ధన్, టోర్నమెంట్ కో ఆర్డినేటర్ వి.రవిరాజు మంగళవారం పరిశీలించారు.